క్లుప్తంగా

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



కృష్ణమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

డోన్: ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న కృష్ణమూర్తి పదవీ విరమణ సందర్భంగా శనివారం ఆయనను కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఆయనకు శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. కృష్ణమూర్తి చేసిన సేవలను ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏఈ జనార్దన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

నైట్‌వాచ్‌మెన్ల ఎంపిక పూర్తి

కొలిమిగుండ్ల: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ఉన్నత పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్ల ఎంపిక ప్రక్రియ పూర్తయినట్లు ఎంఈఓ జిలానీ బాషా శనివారం తెలిపారు. కొలిమిగుండ్ల, పెట్నికోట, గొర్విమానుపల్లె, అంకిరెడ్డిపల్లె, చింతలాయిపల్లె, అబ్దులాపురం, తిమ్మనాయినపేట, యర్రగుడి, కనకాద్రిపల్లె, బెలుంలో మొత్తం పది ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. నైట్ వాచ్‌మెన్‌గా 60 ఏళ్లలోపు వ్యక్తులను ఎంపిక చేశామన్నారు. వీరికి ప్రభుత్వం నెలకు రూ.6వేలు అందిస్తుందన్నారు. మే 1వతేదీ నుంచి వీరు విధులు నిర్వహిస్తారని చెప్పారు.

ఆలయ ధర్మకర్తగా రాంభూపాల్‌రెడ్డి



కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తగా కోవెలకుంట్లకు చెందిన శింగారెడ్డి రాంభూపాల్‌రెడ్డికి అవకాశం కల్పించారు. ప్రతి ఏటా జరిగే ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ధర్మకర్తను ఎన్నుకోవడం ఆనవాయితీ. గతంలో 35 సంవత్సరాలపాటు ధర్మకర్తగా సేవలందించిన శింగారెడ్డి చిన్ననాగిరెడ్డి కుటుంబానికి ఈ ఏడాది ఆ అవకాశం దక్కింది. ఆ కుటుంబానికి చెందిన రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో 12 రోజులపాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి.

బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ ఆంజనేయ

బేతంచెర్ల: రైతులు కొనుగోలు చేసే ఎరువులు, విత్తనాలకు సంబంధించి ఫర్టిలైజర్ దుకాణాల నిర్వాహకులు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని ఏడీఏ ఆంజనేయ సూచించారు. మండల కేంద్రం బేతతంచెర్లతోపాటు ఆర్‌ఎస్ రంగాపురంలోని ఫర్టిలైజర్, ఎరువుల దుకాణాలను ఏఓ కిరణ్ కుమార్‌తో కలిసి ఏడీఏ తనిఖీ చేశారు. స్టాక్, విక్రయాల రికార్డులను పరిశీలించారు. అధిక ధరలకు విత్తనాలు విక్రయించినా, బిల్లులు లేకుండా ఇవ్వకున్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహిళా మార్ట్‌ను పరిశీలించిన ప్రాజెక్టు డైరెక్టర్



మార్ట్ సిబ్బందితో మాట్లాడుతున్న శ్రీధర్ రెడ్డి

బేతంచెర్ల: పట్టణంలోని చేయూత మహిళా మార్టును డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి శనివారం సందర్శించారు. ఈసందర్భంగా మార్ట్‌లోని వస్తువులతో పాటు రికార్డులను పరిశీలించారు. పొదుపు మహిళలతో పాటు ప్రజలు, అధికారులందరూ మహిళా మార్టులో వస్తువులు కొనుగోలు చేసేవిధంగా క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా పీడీ సిబ్బందికి సూచించారు. నాణ్యతతో పాటు సరసమైన ధరలకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం లింగమయ్య, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మిదేవి, చేయూత మహిళా మార్ట్ అధ్యక్షురాలు హరిత, మార్ట్ సీసీ రామసుంకడు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

కోవెలకుంట్ల: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకం కింద మంజూరైన పక్కాగృహాలను పూర్తి చేసి సొంతింటి కలను సాకారం చేసుకోవాలని ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ పుష్పకుమారి సూచించారు. శనివారం మండలంలోని కలుగొట్ల, గుళ్లదూర్తి గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో నిర్మితమవుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్‌ఐ ఇమ్రాన్, హౌసింగ్ ఏఈ సుదర్శన్, గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రజా మద్దతు... సంపూర్ణం

- సీఎం వైఎస్ జగన్ వెంటే జనం
- 'జగనన్నే మా భవిష్యత్తు' విజయవంతం
- అందరి సహకారంతోనే బనగానపల్లె నియోజకవర్గానికి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు ప్రజల మద్దతు సంపూర్ణంగా ఉందని, ప్రతిష్టాత్మంగా చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం విజయవంతం ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ వెంటే జనం ఉన్నారని, రాష్ట్ర వ్యాప్తంగా 1.45 కోట్లు కుటుంబాలు ఈ కార్యక్రమంలో పాల్గొనగా 1.10 కోట్లు ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేసి మిస్డ్ కాల్స్ ఇచ్చారన్నారు. ప్రత్యేకించి బనగానపల్లె నియోజకవర్గంలో 96,433 గృహాలు ఉండగా 89,333 ఇళ్లను వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు సందర్శించారని, 81,023 ఇళ్ల యాజమాన్యాలు ప్రభుత్వానికి మద్దతుగా మిస్డ్ కాల్స్ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వ తీరును సమర్థిస్తూ 92,64శాతం మంది ప్రజల మద్దతు అందరి సహకారంతోనే సాధ్యమైందని, ప్రజల సాయాన్ని ఎప్పటికీ మరువమన్నారు. 'జగనన్నే మా భవిష్యత్తు' ముగింపు నేపథ్యంలో రాష్ట్రంలోనే బనగానపల్లెకు ప్రథమ స్థానం వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని స్వగృహం వద్ద ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి జిల్లాల వైఎస్సార్‌సీపీ పరిశీలకులు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు అఫ్జల్‌ఖాన్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరయ్యారు. ముందుగా మండల స్థాయి సచివాలయాల కన్వీనర్లు గుండం నాగేశ్వరరెడ్డి, సుబ్రహ్మణ్యం, రాజా, సుధాకర్‌రెడ్డి మధుసూదన్‌కు ఎమ్మెల్యే కాటసాని కృతజ్ఞతలు తెలిపారు. వారికి ఎమ్మెల్యేతోపాటు ముఖ్యఅతిథులు, నాయకులు శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. ఎమ్మెల్యే ఇంటి బయట అభిమానులు బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ రాష్ట్రంలో బనగానలపల్లెకు మొదటిస్థానం రావడం సంతోషకరమని, ఇందులో ప్రతిఒక్కరి శ్రమ ఉందని, ఇది ప్రజా విజయమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాలన తీరుపై ప్రజాభిప్రాయ సేకరణ ఇంత వరకు ఏ సీఎం చేపట్టలేదని, ఈ ఘనత... ధైర్యం ఒక్క జగన్‌కే దక్కిందని కొనియాడారు. ఇక టీడీపీ చేపట్టిన ఇదేం ఖర్మ బాబుకు స్పందనే లేదని ఎద్దేవా చేశారు. దాదాపు 125 నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం ఊసే లేదన్నారు. మాటలతో మభ్యపెట్టే చంద్రబాబు తీరు అందరికీ తెలిసిపోయిందని, ఎన్నిజిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ప్రజల వద్దకే పాలన సాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మానసవీణ, ఏపీఐడీసీ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, అవుకు జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ నాయకులు గుండం శేషిరెడ్డి, పోచా శీలారెడ్డి, సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, అంబటి గురివీరెడ్డి, గోపాల్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, అబ్దుల్‌ఫైజ్, జాహెద్‌హుస్సేన్, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, నాగార్జునరెడ్డి, సత్యనారాయణరెడ్డి, గువ్వల రామక్రిష్ణారెడ్డి, ఈశ్వర్‌నాయక్, సురేష్, కాటసాని రామక్రిష్ణారెడ్డి, అల్లె సురేష్‌రెడ్డి, కోడూరు రామచంద్రారెడ్డి, నాగభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో అందరికీ న్యాయం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని, ప్రజలు సంతోషంగా ఉన్నారని ఉమ్మడి జిల్లాల పరిశీలకుడు, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. సీఎం అమలు పరచిన ఈ కార్యక్రమం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో తమ ప్రతినిధులు చిత్తశుద్ధి అంకిత భావంతో ప్రతి ఇంటిని వద్దకు వెళ్లి ప్రభుత్వ పాలనను వివరిస్తూ ప్రజల మద్దతు కూడగట్టుకున్నారని అభినందించారు. గత టీడీపీ ప్రభుత్వంలో మిగిల్చిన అప్పులను సైతం చెల్లిస్తూ సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీలన్నింటినీ ఆర్థిక ఇబ్బందులున్నా అమలుపరుస్తూ పాలనలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చారన్నారు. ఇందులో భాగంగా తీసుకొచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతోపాటు హెల్త్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ తదితర కార్యక్రమాలు అందరి మన్ననలు పొందుతున్నాయని గుర్తు చేశారు. సీఎం జగన్ అభివృద్ధిని టీడీపీ ఓర్వలేకపోతుందని, పచ్చ మీడియాతో తప్పుడు ప్రచారాలు చేయిస్తున్నారని విమర్శించిన ఆయన ప్రజలు చంద్రబాబును ఇక నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

పార్టీలు, కులమతాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని బనగానపల్లె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు అఫ్జల్‌ఖాన్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. ఇలా అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తున్నందునే జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందనలభించిందన్నారు. టీడీపీకి పట్టు ఉన్న ప్రాంతాల్లోనూ మా భవిష్యత్తు జగనన్నే అని ప్రజలు జై కొట్టారని, సంక్షేమ పథకాలు అందజేయడంలో ఎలాంటి తేడా లేనందునే ఈ ఘనత దక్కిందన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల సంబరాలు



కేక్ కట్ చేస్తున్న నాయకులు

అవుకు: 'మా భవిష్యత్ జగనన్నే' కార్యక్రమంలో బనగానపల్లె నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానాన్ని దక్కించుకున్న నేపథ్యంలో శనివారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా పేల్చి, కేక్‌లు కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. మండల పరిధిలోని రామాపురంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేక్ కటింగ్ చేసి అందరికి పంచిపెట్టారు. మొదటి స్థానం రావటానికి కృషి చేసిన మండల కన్వీనర్‌లకు, పార్టీ నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో నాయకులు మల్లు విశ్వనాథ్ రెడ్డి, మధన్ గోపాల్ రెడ్డి, సుంకారి వెంకటేశ్వర రెడ్డి, పేరం వెంకటసుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి,గిరి, పాల నాగిరెడ్డి, రామచంద్రుడు, నాగేశ్వర రెడ్డి, రామారావు, ప్రమోద్ గౌడ్ తదితలరులు పాల్గొన్నారు.

కోలుకోలేక మహిళ మృతి

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం పేరుసోములకు చెందిన ఓ మహిళ ఆస్తి వివాదాల తో ఆత్మహత్యకు పాల్పడింది. శనివారం కోవెలకుంట్ల సీఐ నారాయణరెడ్డి అందించిన సమాచారం మేరకు.. మహానంది మండలం బొల్లవరం గ్రామానికి చెందిన పుష్పవతి(29)కి 13 సంవత్సరాల క్రి తం పేరుసోముల గ్రామానికి చెందిన గోవర్ధన్‌తో వివాహం జరిగింది. అన్నదమ్ములైన గోవర్ధన్, రమ ణయ్య ఉమ్మడి కుటుంబంగా ఉంటున్నారు. ఈ క్రమంలో రమణయ్య గొర్రెలను అమ్మి వచ్చిన డ బ్బుతో పొలం కొనుగోలు చేసి తన పేరున రిజిస్ట్రే షన్ చేసుకున్నాడు. ఈ క్రమంలో బావ, మరదలు మధ్య జరిగిన ఆస్తి వివాదంలో ఘర్షణ చోటు చేసు కుని రెండు రోజుల క్రితం పుష్పవతి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను నంద్యాల ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృత్యువాత పడింది. మృతురాలి సోదరి మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

వ్యక్తికి గాయాలు

బనగానపల్లెరూరల్: పట్టణంలోని కొండపేట సుంకులమ్మగుడి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కాలింగిరి రాముడుకి తీవ్రగాయాలయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాల మేరకు మార్కెట్‌యార్డు సర్కిల్ నుంచి కాలింగిరి రాముడు ద్విచక్రవాహనంపై తన ఇంటికి వస్తుండగా బనగానపల్లె నుంచి అవుకు వైపు వెళ్తున్న కారు, ఎదురుగా వస్తున్న ఆటోను క్రాస్ చేయబోయి తన వాహనాన్ని ఢీకొట్టిందన్నారు. స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచన మేరకు నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

డోన్ టౌన్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమే అని రోటరీ క్లబ్ అధ్యక్షులు దశరథరామిరెడ్డి అన్నారు. స్థానిక పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో హెచ్‌ఎం పద్మావతమ్మ అధ్యక్షతన విద్యార్థులకు శనివారం క్రీడా కిట్‌లు అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మీప్రభావతి, రోటరీ క్లబ్ సభ్యులు జింకల కృష్ణ, శంకర్ గౌడ్, రమేశ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కోనా మురళీధర్‌రెడ్డి

డోన్ : పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ డోన్ నియోజకవర్గ పరిశీలకుడు కోనా మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు తమతో పాటు తమ పిల్లల భవిష్యత్తు సీఎం జగనన్న చేతుల్లో ఉందని ప్రగాఢంగా విశ్వసిస్తున్నారన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో శనివారం నియోజకవర్గస్థాయి గృహసారథుల సమావేశాన్ని నిర్వహించారు. ఎంపిపి రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మార్కెట్ యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్ హాజరైన సమావేశంలో వారు మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ప్రారంభమైన నాటి నుండి 7లక్షల మంది గృహసారథులు సైన్యం వలే పనిచేసి రాష్ట్రవ్యాప్తంగా 1.45 కోట్ల కుటుంబాలను కలిసి జగనన్న ప్రభుత్వ పనితీరుపై మద్దతు కూడగట్టారన్నారు. క్షేత్రస్థాయిలో నిబద్ధత, నిజాయితీతో పనిచేసే కార్యకర్తలు వైఎస్సార్‌సీపీకి ఉన్నారనేదానికి ఈ పీపుల్స్ సర్వే విజయవంతం కావడమే నిదర్శనమన్నారు. కులమతాలు, వర్గ విబేధాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.2లక్షల కోట్లను ఖర్చు చేసిందన్నారు. కోట్లాది మంది సీఎం జగన్‌పై తమ నమ్మకాన్ని స్వచ్ఛందంగా తెలియజేసినందుకు పార్టీ తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

రాజకీయ అజ్ఞాని లోకేష్

పాదయాత్ర సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ప్రజాప్రతినిధుల పట్ల టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని వారు తెలిపారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకుంటున్న చంద్రబాబు తన కుమారునికి సభ్య త, సంస్కారం నేర్పించాలన్నారు. లోకేష్ రాజకీయ అజ్ఞాని అని, నోటికి వచ్చినట్లు మాట్లాడితే అభిమానులు, కార్యకర్తలు పాదయాత్రను అడ్డుకొని తగిన గుణపాఠం నేర్పుతారని వారు హెచ్చరించారు. సమావేశంలో గృహసారథుల కన్వీనర్లు బోరా మల్లికార్జునరెడ్డి, కురుకుందు హరి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వరరెడ్డి, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ దినేష్‌గౌడ్, నాయకులు భాస్కర్‌నాయుడు, ఆర్‌ఈ రాజవర్ధన్, ఓబులాపురం మదన్, సురేంద్రనాథ్‌రెడ్డి, కటిక వేణు, కుళ్లాయప్ప, దస్తగిరి, మహేంద్ర, ఆర్ట్ రమణ, నరసింహారెడ్డి, మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంఈఓ, ఎంఐఎస్ మధ్య వాగ్వాదం

అవుకు: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ శ్రీధర్ రావు, ఎంఐఎస్ సుబ్బరాయుడుల మధ్య శనివారం వాగ్వాదం చోటుచేసుకుంది. ఎంఐఎస్ చేయాల్సిన పనిని ఎంఈఓ తనకు కావాల్సిన ఒక సీఆర్‌పీకి అప్పగించటంతో వీరి మధ్య గొడవలు ఎక్కువయ్యాయి. శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల డేటాను ఆన్‌లైన్ చేసే భాగంలో నలుగురు ఉపాధ్యాయుల అటెండెన్స్ ఖాళీగా ఉండటంతో ఎంఐఎస్... సీఆర్‌పీలకు తెలియజేసి త్వరగా అటెండెన్స్‌కు సంబంధించిన వివరాలను తెలపాలని కోరారు. అయితే శుక్రవారం ఉదయం 11 గంటలకే ఎమ్మార్సీ సిబ్బంది సీఆర్‌పీలు, మెసెంజర్ అందరూ వెళ్లిపోవటంతో తాను ఒక్కడినే పనులన్నీ చేసుకోవాలా అని ఎంఈఓకు ఫిర్యాదు చేయటంతో ఆయన ఫోన్‌లో తనను దుర్భాషలాడాడు. దీంతో క్షణికావేశానికి గురైన ఎంఐఎస్ ఎంఈఓతోపాటు సీఆర్‌పీలపై విమర్శలు చేశారు. ఈ విమర్శలను ఓ సీఆర్‌పీ ఫోన్‌లో రికార్డు చేసి శనివారం ఎంఈఓకు వినిపించడంతో ఎంఐఎస్‌ను దండించాడు. మాటామాటా పెరిగి వాగ్వాదానికి దారితీసింది. ఎమ్మార్సీ కార్యాలయంలో గొడవ విషయంపై డీఈఓ అనురాధ దృష్టికి తీసుకెళ్లగా ఇంతవరకు ఆ విషయం తన దృష్టికి రాలేదన్నారు.

లోకో యాప్‌పై ముగిసిన శిక్షణ

బనగానపల్లెరూరల్: స్థానిక పొదుపు భవనంలో లోకో యాప్‌పై రెండు రోజులుగా జరుగుతున్న శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ మన రాష్ట్రంలో పొదుపు సంఘాల్లో జరుగుతున్న సంక్షేమ పథకాలు, సంఘాల పనితీరు దేశ వ్యాప్తంగా ఇతర రాష్ట్రాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రత్యేకంగా లోకో యాప్ రూపొందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ దానం, లోకో యాప్ ట్రైనర్స్ శ్రీనివాసులు, శేఖర్, నరసయ్య, ఇమాం, డోన్ డివిజన్‌లోని ఎంపీఎంలు, సీసీలు,వీఓఏలు పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యాన్ని అధిగమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

కోవెలకుంట్ల: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద 2023–24 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పీడీ రామచంద్రారెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో 78.31 లక్షల పనిదినాలు పూర్తి చేయాల్సి ఉందని, రూ. 335 కోట్ల లేబర్ బడ్జెట్ కేటాయించామన్నారు. వ్యవసాయ పొలాలకు రహదారులు, కేసీ, ఎస్సార్బీసీ, కుంటలు, చెరువులు, బావుల్లో పూడికతీత, కొత్తగా పంట కాల్వలు, కొండ ప్రాంతాల్లో నీరు నిల్వ చేరే పనులు, ఉద్యానవన శాఖ పరిధిలో మామిడి, నిమ్మ, సపోట, జామ, తదితర పండ్ల తోటల పెంపకం తదితర 30 నుంచి 40 రకాల పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సాంబశివరావు, ఆయా మండలాల ఎంపీడీఓలు మహబూబ్‌దౌలా, నాగకుమార్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



ఓబుళాపురంలో వరిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

అవుకు: మండల పరిధిలోని వరి రైతులు నకిలీ విత్తనాల మూలంగా పంట ఎదుగుదలపై ప్రభావం చూపిందని ఆవేదన వ్యక్తం చేస్తూ రైతులు వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన విషయం విదితమే. ఈమేరకు ఆయన వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించారు. శనివారం ఓబుళాపురంలో సాగు చేసిన వరి పంటను నంద్యాల ప్రాంతీయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తల బృందం ప్రభాకర్, రమాదేవి, చైతన్య, కోవెలకుంట్ల సహాయ వ్యవసాయ సంచాలకులు కృష్ణమోహన్ రెడ్డి పరిశీలించారు. రైతులతో పంటల వివరాలు సేకరించారు. త్వరలోనే వివరాలను వెల్లడిస్తామని రైతులకు తెలిపారు. రైతులకు పంట నష్టం జరుగకుండా చూడాలని వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి వ్యవసాయ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఏఓ ప్రసాద్ రావు, సహాయకుడు బాషా, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న చలం రెడ్డి

బేతంచెర్ల: వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన కమిషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో వార్డు కౌన్సిలర్ సభ్యులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో నెల కొన్న సమస్యలతో పాటు కుక్కల బెడద, తాగునీటి సమస్య, కాలనీల్లో చేపట్టే అభివృద్ధి పనులపై చర్చించారు. పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తితే తమదృష్టికి తీసుకురావాలని, ప్రత్యామ్నాయంగా ట్యాంకర్లను సరఫరా చేస్తామని చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. అనంతరం ఆయా కాలనీల్లో సుమారు రూ.1,20 కోట్లతో చేపట్టే సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వ పనులతో పాటు కమ్యూనిటీ టాయిలెట్స్, తాగునీటి మోటార్ మరమ్మతుల పనులకు సభ్యుల ఆమోదం తెలుపుతూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు చింతల నాగిరెడ్డి, మధు సూధన్, షేక్ ముబీనా, మహేశ్వరి, శకుంతల పాల్గొన్నారు.

ఇంటర్ ఫెయిల్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

సంజామల(కోవెలకుంట్ల): మండల కేంద్రం సంజామల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో విద్యార్థులు ఫెయిల్ అయిన సబ్జెక్టులకు సంబంధించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. మే 1వ తేదీ నుంచి 24వ తేదీ వరకు క్లాసులు కొనసాగుతాయన్నారు. ప్రతి రోజు ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు జరుగుతాయని, ఫెయిల్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బనగానపల్లెరూరల్: ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ భీముడు నాయక్ తెలిపారు.

డోన్ టౌన్: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫెయిల్ అయిన విద్యార్థులకు మే 1 వ తేదీ నుంచి డోన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కృష్ణయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 వ తేదీ నుంచి 20 వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 8–30 నుంచి 12–30 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు.

పెచ్చులూడిన ఓవర్ హెడ్ ట్యాంక్ పరిశీలన



ట్యాంకును పరిశీలిస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీల్లో సుమారు 38 సంవత్సరాల క్రితం నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్ పై భాగన శిథిలావస్థకు చేరుకొని పెచ్చులూడి నీరు అంతా వచ్చింది. సమాచారం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మరమ్మతులు చేయిస్తామని, అంతవరకు ఆయా కాలనీలలో నీటి సమస్య తలెత్తకుండా సరఫరా చేస్తామని కమిషనర్ రమేష్ బాబు తెలిపారు.

బిల్లస్వర్గం గుహలను పరిశీలించిన అధికారులు

బేతంచెర్ల: మండల పరిధిలోని కనుమకింది కొట్టాల గ్రామ సమీపాన ఉన్న బిల్ల స్వర్గం గుహల అభివృద్ధికి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో ఏపీ టూరిజం కింద సుమారు రూ. 2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. సంబంధిత బిల్ల స్వర్గం గుహల వద్ద జరుగుతున్న పనులను తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు శనివారం పరిశీలించారు. ముందుగా గుహల వద్దకు ఏర్పాటు చేసిన రహదారి నిర్మాణ పనులతో పాటు గుహల లోపల జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శేఖర్‌బాబు, నగర పంచాయతీ ఏఈ సురేష్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

డోన్ టౌన్: పట్టణ శివారులోని రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో శనివారం ఎంవీఐ క్రాంతి కుమార్, రూరల్ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని వాహనచోదకులకు కౌన్సెలింగ్ ఇచ్చి రూ. 34 వేలు జరిమానా విధించారు.

కోవెలకుంట్ల: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. స్థానిక ముదిగేడు, జమ్మలమడుగు, బనగానపల్లె చౌరస్తాల్లో వాహనాల తనిఖీ నిర్వహించి రికార్డులు లేని వాహన చోదకులకు జరిమాన విధించారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నవోదయ పాఠశాలలో ఆరవ తరగతిలో అడ్మిషన్ పొందేందుకు జరిగిన రాత పరీక్షకు కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 273 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 22 మంది గైర్హాజర్ అయినట్లు పరీక్షా కేంద్రం చీఫ్ సూపర్‌వైజర్ రామకృష్ణయ్య తెలిపారు.